
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 71 వ భాగం

### అజామీళోపాఖ్యానం – 6

### విష్ణుదూతల సమాధానం

అజామీళుడి ప్రాణం పోతూంటే, తన కొడుకుని తలుచుకుంటూ నారాయణ, నారాయణ అంటూ పోయాడు కదా. బతికున్నప్పుడు ఎన్నో పాపాలు చేసాడు కనక అతన్ని యమదూతలు తీసుకెళ్తూంటే వాళ్లని అడ్డుకున్న విష్ణుదూతలని అడిగారు ఎందుకు అతన్ని యముడి దగ్గిరకి తీసుకెళ్లకోడదో. అసలు తీసుకెళ్ళడానిక్కారణం కూడా చెప్పారు – ఈ పాపాలకి శిక్ష అనుభవించాక ప్రక్షాళన జరిగి బాగుపడతాడు అంటూ. అప్పుడు విష్ణుదూతలు చెప్తున్నారు ఇదంతా విన్నాక.

క. అవురా! ధర్మవివేక
ప్రవరుల పస గానఁబడియెఁ బాపము పుణ్యో
ద్భవుల యదండ్యుల దండన
వివరం బొనరింపఁ బడియె విధి యెఱుఁగమిచేన్. [6-111]

మీరు ధర్మాధర్మ విచక్షణ ఎలా చేస్తారో, అసలు అలా ధర్మదూతలం అని చెప్పుకునే మీ 'పస' (సామర్థ్యం) ఎటువంటిదో ఇప్పుడు తెలిసివచ్చింది. పుణ్యం చేసుకున్న వాళ్లకీ పాపులకీ తేడా మీరు కనిపెట్టలేరని తెలుస్తోంది.

చ. సములును సాధులున్ విహితశాసనులున్సుదయాళురున్ శుభో
త్తమగుణులైన యట్టి తలిదండ్రులు బిడ్డల కెగ్గు జేయుచోఁ
గ్రమమున వార లెవ్వరికిఁ గైకొని కుయ్యిడఁజాలువారు సం
భ్రమమున మీ మనంబులఁ దిరంబుగఁ జర్చయొనర్చి చూడుఁడా [6-112]

ఓ సారి ఆగి ఆలోచించి చూడండి (మనంబుల దిరంబుగ జర్చయొనర్చి) – సమబుద్ధి కలవారు, సాధువులైనటి వంటివారు, నియమాలతో జీవితం గడిపేవారు, మంచి గుణాలున్నవారు అయిన తల్లీ తండ్రీ వాళ్ల పిల్లలకే అపకారం తలపెడితే (బిడ్డలకెగ్గు జేయుచో) అప్పుడు వాళ్ళు ఎవరితో మొరపెట్టుకోవాలి (ఎవ్వరికి గైకొని కుయ్యిడజాలువారు)? ఇక్కడ వీళ్ళు చెప్పేదేమిటంటే, సర్వాంతర్యామి అయిన భగవంతుడు ప్రజలందరికీ తల్లీ తండ్రీ కదా? అటువంటి భగవంతుడెటువంటివాడు? సమబుద్ధి, సాధువు, దయాళువు, శుభోత్తమగుణాలు కలవాడు. అటువంటి తండ్రి అతని పిల్లలమైన మనకి అపకారం చేయడు కదా? అలాగే ఇక్కడ అజామీళుడు ఎంత చెడ్డవాడైనా భగవంతుడు దయాళువు కనక ఓ సారి ఆలోచించండి, ఇతను దండనార్హుడా?

ఆ. ఎఱుక గలుగు నాతఁ డేది యొనర్చిన
నది యొనర్తు రితరు లైన వార
లతఁడు సత్య మిట్టి దనె నేని లోకంబు
దత్ప్రవర్తనమునఁ దగిలి యుండు. [6-113]

లోకంలో నిరంతరం జరిగే నియమం ఏమిటంటే, జ్ఞానంతో ఉన్నవాడు ఏం చేస్తాడో, మిగతావాళ్ళు కూడా అదే చేయడానికి ప్రయత్నం చేస్తారు. ఆ జ్ఞాని సత్యం అనేదేమిటో చెప్తే, లోకం కూడా అదే నమ్ముతుంది. ఇదే భగవద్గీతలో చూడవచ్చు – యద్యదాచరతి శ్రేష్ఠః, తత్తదేవేతరో జనః, సయత్ప్రమాణం కురుతే, లోకస్తదనువర్తతే (కర్మయోగం-21)

ఆ. నెమ్మిఁ దొడలమీఁద నిద్రించు చెలికాని
నమ్మఁదగినవాఁడు నయము విడిచి
ద్రోహబుద్ధిఁ జంప దొడరునే? యెందైనఁ
బ్రీతి లేక ధర్మదూతలార! [6-114]

అది అలా ఉంచితే, స్నేహితుణ్ణి నమ్మి అతని కాళ్లమీద తలపెట్టుకుని పడుకుంటే, ద్రోహంతో ఆ స్నేహితుడు పడుకున్నవాణ్ణి, న్యాయం విడిచిపెట్టి చంపడానికి పూనుకుంటాడా?ధర్మదూతలని చెప్పుకునే మీరే చెప్పండి దీనికి సమాధానం. ఈ పద్యంలో నయము విడిచి అంటే – న్యాయం విడిచి.

ఆ. చిత్తమెల్ల నిచ్చి చెలితనంబున వచ్చి
నచ్చి కలయ మెచ్చి నమ్మువానిఁ
గరుణ గలుగువాఁడు కడుసౌమ్యుఁ డగువాఁడు
చింతజేయ కెట్లు చెఱుప నేర్చు? [6-115]

తనని మనసారా నమ్మి స్నేహం చేసి, తనని నమ్ముకున్న వ్యక్తికి మంచివాడు (కడు సౌమ్యుడగువాడు), కరుణ ఉన్నవాడు వేరే ఆలోచన లేకుండా కీడు చేస్తాడా? ఇవన్నీ ఎందుకు చెప్తున్నారంటే, ఎప్పుడో ఈ అజామీళుడు ఏదో పుణ్యం చేసాడు. ఆ పుణ్యం వల్ల ఈ జన్మలో ఎన్ని పాపాలు చేసినా భగవంతుడి పేరు నోట్లోకి వచ్చింది పూర్వజన్మ సుకృతం వల్ల. ఆ విషయం యమదూతలకి తెలియదు. కానీ ఈ విష్ణుదూతలకి తెలుసు కాబోలు. అవి ఇప్పుడు విడమర్చి చెప్తున్నారు. ఏన్నో ఏళ్లు నిరంతరం అభ్యాసం చేసినా ప్రాణం పోయేటపుడు భగవంతుడు గుర్తు రావద్దూ? అసలు ప్రాణం పోయేటపుడు ఏ స్థితిలో ఉంటాం?

ఉ. ఈతఁడు కోటిసంఖ్యలకు నెక్కుడు పుట్టువులందుఁ జెంది యా
యాతము లైన పాప నివహంబుల నన్నిటిఁ బాఱఁ దోలెఁ బ్ర
ఖ్యాతమతిన్ మహా మరణ కాలమునన్ హరిపుణ్యనామ సం
భూత సుధామయాద్భుత విభూతిక రాక్షర సంగ్రహంబునన్. [6-117]

ఈ అజామీళుడు పోయేటపుడు భగవంతుడి పుణ్యనామం నోట్లోంచి రావడం వల్ల కోటానుకోట్ల పుట్టుకలతో వచ్చిన పాపాలన్నింటినీ పోగొట్టుకున్నాడు. ఆ పాపాలు ఎటువంటివి? ఆయతములు అంటే ఎన్నెన్నో జన్మలతో కూడబెట్టుకుంటూ వచ్చినవి. మరి అటువంటి పాపాలు ఎందుకు పోయాయి ఒక్కసారి? మరణకాలంలో – అద్భుతమైన, అమృత తుల్యమైన (సుధామయ), వైభవం (విభూతి) కల అక్షరాల తో కూడింపబడిన – భగవంతుడి పుణ్య నామం నోట్లోంచి రావడం వల్ల.

సీ. బ్రహ్మహత్యానేక పాపాటవుల కగ్ని;
కీలలు హరినామ కీర్తనములు;
గురుతల్ప కల్మష క్రూరసర్పములకుఁ;
గేకులు హరినామ కీర్తనములు;
తపనీయ చౌర్య సంతమసంబునకు సూర్య;
కిరణముల్ హరినామ కీర్తనములు;
మధుపాన కిల్బిష మదనాగ సమితికిఁ;
గేసరుల్ హరినామ కీర్తనములు; [6-118]

తే. మహిత యోగోగ్ర నిత్యసమాధి విధుల
నలరు బ్రహ్మాది సురలకు నందరాని
భూరి నిర్వాణ సామ్రాజ్య భోగభాగ్య
ఖేలనంబులు హరినామ కీర్తనములు [6-118.1]

ఆ "నారాయణ, హరి" అనే పుణ్యనామానికి ఇంత సామర్థ్యం ఉందా అని అడుగుతారేమో అని దాని గురించి చెప్తున్నారు. బ్రహ్మ హత్యతో సహా అనేక పాపాలకి హరినామం అనేది అగ్నికీల; గురువు భార్యతో సంగమం చేసిన గురుద్రోహం అనే క్రూరసర్పాలకి హరినామ కీర్తనలు నెమళ్ళు (కేకులు); బంగారం వంటి వస్తువులు దొంగతనం చేస్తే వచ్చే చిక్కని చీకట్లవంటి (సంతమసంబునకు) పాపాలకి సూర్యకిరణాలు; మద్యం తాగితే వచ్చే మదపుటేనుగు వంటి పాపాలకి సింహాలు (కేసరులు). ఎంతో యోగంతో నిత్య సమాధి వల్ల, బ్రహ్మ నుంచి ఏ దేవతలకీ కూడా అందని విలాసాలు (నిర్వాణ సామ్రాజ్య భోగభాగ్య ఖేలనంబులు)

సీ. ముక్తికాంతైకాంత మోహన కృత్యముల్;
కేలిమై హరినామ కీర్తనములు;
సత్యలోకానంద సౌభాగ్యయుక్తముల్;
కేలిమై హరినామ కీర్తనములు;
మహిత నిర్వాణ సామ్రాజ్యాభిషిక్తముల్;
కేలిమై హరినామ కీర్తనములు;
బహుకాల జనిత తపఃఫల సారముల్;
కేలిమై హరినామ కీర్తనములు; [6-119]

తే. పుణ్యమూలంబు లనపాయ పోషకంబు
లభిమతార్థంబు లజ్ఞాన హరణ కరము
లాగమాం తోపలబ్దంబు లమృతసేవ
లార్తశుభములు హరినామ కీర్తనములు; [6-119.1]

అంతేనా? సత్యలోకం ప్రసాదించేదీ, నిర్వాణ సామ్రాజ్యం వచ్చేదీ, ఏన్నోఏళ్ళు చేసిన సాధన వల్ల తపోఫలం లభించేది ఈ హరినామ సంకీర్తనం వల్లే. పుణ్యమూలం, ప్రమాదాలనుంచి రక్షించి పోషించేవి (అనపాయ – ఎడబాటు లేకుండా, పోషకంబులు), అభిమతాలని తీర్చేవి, అజ్ఞానం పోగొట్టేవి, వేదాంతంలో లభించేవి, అమృతంవంటివి, శుభాలని అందించేవి హరి నామాలు. ఈ పద్యంలో వేదాంతం అనేదెక్కడుందో చెప్పండి చూద్దాం? ఆగమాంతోపలబ్దంబు – ఆగమాంత – వేదాంత, ఉపలబ్దంబు – లభించేవి.

క. కామంబు పుణ్యమార్గ
స్థేమంబు మునీంద్ర సాంద్రచే తస్సరసీ
ధామంబు విష్ణు నిర్మల
నామంబుఁ దలంచువాఁడు నాథుఁడు గాడే? [6-120]

పుణ్యమార్గం కి నిలువైనదీ, కోరదగినదీ, మునీంద్రుల చిక్కటి సరస్సు అనే మనసులలో (మునీంద్ర సాంద్రచే తస్సరసీ) ఉన్న విష్ణునామం తల్చుకునేవాడు (అదీ ప్రాణం పోయేటపుడు) ధన్యుడే కదా?

క. డెందంబు పుత్రు వలనం
జెందిన దని తలఁప వలదు శ్రీపతి పే రే
చందమున నైనఁ బలికిన
నందకధరుఁ డందుఁ గలఁడు నాథుం డగుచున్. [6-121]

అయితే వీడు పోయేటపుడు కొడుకుని మనసులో పెట్టుకుని 'నారాయణ' అన్నాడు కానీ భగవంతుణ్ణి తల్చుకుని కాదు అని ఆలోచించకండి – శ్రీపతి పేరు ఏ విధంగా తల్చినా నందక ధరుడు (నందకం అనే ఖడ్గం ధరించేవాడు, విష్ణువు) అందులోనే ఉంటాడు. దీన్నే ప్రహ్లాదోపాఖ్యానంలో చూసాం – 'ఇందుగలడందులేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండు...(7.275)' 'అంభోజాసనుడాదిగాగ తృణపర్యంతంబు విశ్వాత్ముడై సంభావనసుండ, ప్రోడ విపుల స్థంభంబునందుండడే..(7.282)' అంటూ ప్రహ్లాదుడు తండ్రితో చెప్పడం.

ఆ. బిడ్డపేరు పెట్టి పిలుచుట విశ్రామ
కేళి నైన మిగులఁ గేలి నయినఁ
బద్య గద్య గీత భావార్థముల నైనఁ
గమలనయనుఁ దలఁపఁ గలుషహరము. [6-122]

పిల్లాడి పేరు పెట్టిపిలిచినా, ఆటల్లోనైనా, విశ్రాంతి సమయంలో అయినా, పద్యం, గద్యం, గీతార్థంలో అయినా ఎలా అయినా సరే కమలనయుణ్ణి (పద్మాల వంటి కనులు కలవాణ్ణి, శ్రీహరిని) తలిస్తే పాపాలు పోతాయి. (కలుష హరము). అంటే భగవంతుణ్ణి ఏదో విధంగా తలుచుకోవడమే కానీ ఏ విధంగా తల్చుకున్నాం అనేది ముఖ్యం కాదు. దీన్నే నారదుడు ధర్మరాజుతో చెప్పడం గమనించాం ముందు వ్యాసాల్లో – " కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు వైర క్రియా సామగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్ ...హరి చెందన్ వచ్చు ధాత్రీశ్వరా (7.18)

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS